T/AP/2025/1017/2082/1372

గుండెపోటుతో పోలింగ్ అధికారి మృతి

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో విషాదం చోటు చేసుకుంది. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న పోలింగ్ అధికారి గుండెపోటుతో మృతి చెందారు. అనంతపురం జిల్లా కూడేరు మండలం కాడదారకుంటలో ఏపీవోగా విధులు నిర్వహిస్తున్న హరిత గౌడ్‌కు గుండెపోటు గురయ్యారు. దీంతో అతడిని కూడేరు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. రాయదుర్గం మండలంలో టీచర్‌గా పనిచేస్తున్న హరితగౌడ్‌కు ఎన్నికల బాధ్యతలు అప్పగించగా గురువారం ఎన్నికల డ్యూటీలో ఉండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ఏపీలో 582 జడ్పీటీసీ స్థానాలకు 2,169 మంది , 7,767 ఎంపీటీసీ స్థానాలకు 18,843 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు.

ది ఎవిడెన్స్

THE EVIDENCE

డిజిటల్ తెలుగు దినపత్రిక

మురసు తుపాను ఎఫెక్ట్.. భారీ వర్షాలు..!

అమరావతి : మురసు తుపాను ప్రభావంతో గోదావరి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. అత్యధికంగా ఏలూరు జిల్లా బయ్యనగూడెంలో 18.2 సెంటీమీటర్లు, జిలుగుమిల్లిలో 13.9 సెంటీమీటర్‌లు, పి నారాయణపురంలో 12.8 సెంటీ మీటర్లు, కాకినాడ జిల్లా ఆర్యవటంలో 12.6 సెంటీమీటర్లు, పెద పూడిలో 12.6 సెంటీమీటర్లు, కాజులూరులో 12.1 సెంటీ మీటర్లు, కరపలో 12 సెంటీమీటర్లు, వేళంగిలో 11.4 సెంటీ మీటర్లు, జి మామిడిలో 11.2 సెంటీమీటర్ల వర్షపాతం నమో దైంది. గురువారం కూడా విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, అనకాపల్లి, కాకి నాడ, అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, మార్కాపురం, ప్రకాశం, నంద్యాల, కడప, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడ క్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ అధికారులు తెలిపారు.

తేది: 06-11-2026 శుక్రవారం సంపుటి: 1 సంచిక : 294 ఎడిటర్ : జి. శ్రీనివాసరావు విశాఖపట్నం పేజీలు : 4 వెల: 1/-

మురసు తుఫానుతో ప్రాథమికంగా

రూ.1,918 కోట్ల నష్టం

- 1.43 లక్షల హెక్టార్లలో దెబ్బతిన్న పంట పొలాలు
- రాష్ట్రంలో తుఫాను నష్టంపై సమీక్షించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- రేపు ముంపు ప్రభావిత ప్రాంతాల్లో సీఎం పర్యటన



అమరావతి, నవంబర్ 05, (ది ఎవిడెన్స్): మురసు తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో రూ. 1,918 కోట్ల మేర నష్టం వాటిల్లినట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసింది. ఈమేరకు క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు మురసు తుఫాను నష్టాలపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ, విద్యుత్, మున్సిపల్, పంచాయతీరాజ్ తదితర శాఖల వారీగా జరిగిన నష్టాన్ని, చేపట్టిన సహాయక చర్యల వివరాలు సీఎం తెలుసుకున్నారు. వరుసగా రెండు తుపాన్లు రాష్ట్రాన్ని ప్రభావితం చేసిన నేపథ్యంలో రైతులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ, రహదారుల మరమ్మతులు, తాగునీటి సరఫరాకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవడంపై ప్రధానంగా దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. శుక్రవారం స్వయంగా తాను తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితులను పరిశీలిస్తానని తెలిపారు. మురసు తుఫాన్ నష్టంపై సమగ్ర నివేదిక త్వరితగతిన రూపొందించి కేంద్రానికి సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అధికారులు తాజాగా వెల్లడించిన ప్రాథమిక నష్టం అంచనాల ప్రకారం... తుపాను కారణంగా రాష్ట్రానికి సుమారు రూ.1,918.55 కోట్ల మేర ప్రాథమిక నష్టం వాటిల్లింది. 1,43,122 హెక్టార్లలో వ్యవసాయ పంటలు దెబ్బతినగా, 1,86,063 మంది రైతులపై ప్రభావం పడింది. ఉద్యానవన పంటలు 6,749 హెక్టార్లలో దెబ్బతినగా, 12,586 మంది రైతులు ప్రభావితమయ్యారు. వర్షాల కారణంగా 983 ఇళ్లు, 346 బోట్లు, 220 వలలు కూడా దెబ్బతిన్నాయి. నీట మునిగిన పంట నష్టాన్ని అంచనా వేసేందుకు 48--72 గంటల సమయం అవసరమని అధికారులు తెలిపారు.

విద్యుత్, రహదారుల పునరుద్ధరణ చర్యలు

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ యుద్ధ ప్రాతిపదికన జరుగుతోందని అధికారులు వివరించారు. ఏపీసీపీడీసీఎల్ పరిధిలో 1,103 ప్రభావిత 11 కేవీ ఫీడర్లలో 871 పునరుద్ధరించినట్టు సీఎంకు తెలిపారు. మరో 232 పునరుద్ధరించాల్సి ఉందని స్పష్టం చేశారు. 3,946 దెబ్బతిన్న 11 కేవీ విద్యుత్ స్తంభాల్లో 1,493 పునరుద్ధరించారు. ఏపీఎన్‌పీడీసీఎల్ పరిధిలో 11 కేవీ ఫీడర్లన్నీ పునరుద్ధరించాల్సి ఉందన్నారు. ఏపీ ట్రాన్స్‌కో పరిధిలో ప్రభావితమైన 25 హైటెన్షన్ ఫీడర్లలో 21 పునరుద్ధరించారు. ఆర్ అండ్ బీ పరిధిలో రాష్ట్ర, జిల్లా రహదారులు 760.10 కిలోమీటర్ల వరకు దెబ్బతిన్నాయి. 206 ప్రాంతాల్లో నేలకొరిగిన చెట్లను తొలగించినట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ పరిధిలో 74 గ్రామీణ రహదారులు దెబ్బతినగా, 204.14 కిలోమీటర్ల మేర నష్టం వాటిల్లిందని తెలిపారు. వీటి పునరుద్ధరణకు రూ.92.08 కోట్ల అవసరమని అంచనా వేశారు.

టెలికాం సేవలు 97 శాతం పునరుద్ధరణ

గురువారం వరకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 31,428 టవర్లలో 30,518 టవర్లు తిరిగి పనిచేస్తున్నాయి. 97.1 శాతం సేవలు పునరుద్ధరించారు. బాపట్ల, ప్రకాశం, పశ్చిమ గోదావరి జిల్లాల్లోనే పలుచోట్ల టవర్ల పునరుద్ధరణ జరగాల్సి ఉంది. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో 59 మండలాలు, 649 గ్రామ పంచాయతీలు ప్రభావితం అయ్యాయి. 336 చోట్ల గుర్తించిన డ్రైనేజీ అడ్డంకులన్నింటినీ తొలగించారు. పారిశుద్ధ్య పనుల కోసం 5,515 బృందాలు, 1,489 జనరేటర్లను వినియోగిస్తున్నారు. పది వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎనిమిదింటికి రాకపోకలను పునరుద్ధరించారు. పశ్చిమ గోదావరి జిల్లాలో మరో రెండు ప్రాంతాలకు రాకపోకలు పునరుద్ధరించాల్సి ఉంది.

వరద ప్రవాహాలపై నిరంతర పర్యవేక్షణ

ప్రకాశం బ్యారేజీకి 43,500 క్యూసెక్కుల వరద ప్రవాహాలు కొనసాగుతున్నాయి. యథాతథంగా ఈ నీటిని దిగువకు వదిలిపెడుతున్నారు. 70 గేట్లలో 60 గేట్లు తెరిచి ఉంచారు. బుడమేరు డైవర్షన్ ఛానల్ ద్వారా 6,047 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. తమ్మిలేరు ఇన్‌ఫ్లో 26,000 క్యూసెక్కుల నుంచి 10,200 క్యూసెక్కులకు తగ్గింది. నల్లమడ డ్రెయిన్‌లో 30,259 క్యూసెక్కుల ప్రవాహం నమోదైంది. ప్రధాన జలాశయాలు, కాలువల పరిస్థితిని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. తుపాను కారణంగా బాపట్ల జిల్లాలో ఐదు, గుంటూరు జిల్లాలో రెండు, పల్నాడు జిల్లాలో ఒకటి చొప్పున మొత్తం ఎనిమిది మంది మృతి చెందినట్టు గుర్తించారు.

వేగంగా స్పందన...సాయం

తుపాను సహాయక చర్యల్లో 11 ఎస్‌డీఆర్ఎఫ్, 13 ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలతో పాటు 390 మంది అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు. సుమారు 5.87 కోట్ల ముందస్తు హెచ్చరిక సందేశాలు ప్రజలకు పంపించారు. బాధితులకు 52,768 ఆహార పొట్లాలు, 43,954 తాగునీటి ప్యాకెట్లు పంపిణీ చేశారు. 211 వైద్య శిబిరాలు నిర్వహించారు. తక్షణ సహాయక చర్యల కోసం ప్రభుత్వం జిల్లాలకు రూ.37 కోట్లు విడుదల చేసింది. దెబ్బతిన్న విద్యుత్, రహదారులు, తాగునీటి వ్యవస్థల పునరుద్ధరణతో పాటు ఇతర మౌలిక వసతుల మరమ్మతులు శరవేగంగా కొనసాగుతున్నాయని అధికారులు సీఎంకు వివరించారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి ప్రజలు ఇబ్బందులు పడకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

ముగిసిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ పోలింగ్

- సమస్యాత్మక కేంద్రాల్లో సీపీ బాగ్చి ఆకస్మిక తనిఖీలు
- 100 మీటర్ల పరిధిలో పటిష్ట భద్రత
- వృద్ధులు, దివ్యాంగులకు పోలీసుల చేయూత
- ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రశంసలు





విశాఖ క్రైమ్: నవంబర్ 05 (ది ఎవిడెన్స్): విశాఖ జిల్లా వ్యాప్తంగా గురువారం ప్రజాస్వామ్య బద్ధంగా, ఉత్కంఠభరిత వాతావరణంలో జరిగిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ మునుపెన్నడూ లేని విధంగా ప్రశాంతమైన వాతావరణంలో, ఎటువంటి చిన్నపాటి అవాంఛనీయ సంఘటనలకూ తావులేకుండా విజయవంతంగా ముగిసింది. పోలింగ్ ప్రక్రియను నిష్పాక్షికంగా, అత్యంత పారదర్శకంగా, పకడ్బందీ భద్రతా ప్రమాణాలతో నిర్వహించాలనే ప్రధాన లక్ష్యంతో విశాఖ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి స్వయంగా రంగంలోకి దిగి క్షేత్రస్థాయి పర్యటనలు చేపట్టారు. నగర పరిధిలోని అత్యంత సమస్యాత్మక, సున్నితమైన ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన నేరుగా సందర్శించి, అక్కడ కల్పించిన భద్రతా ఏర్పాట్లను అణువణువూ పరిశీలించారు. ఓటర్లు సుదీర్ఘ సమయం వేచి ఉండకుండా వేగవంతంగా ఓటు హక్కు వినియోగించుకునేలా క్రమబద్ధీకరించిన క్యూ లైన్ల నిర్వహణను, ఎండల తీవ్రత దృష్ట్యా తాగునీరు, నీడ, వైద్య సదుపాయాల వంటి మౌలిక వసతులను సీపీ నేరుగా తనిఖీ చేశారు. క్యూ లైన్లలో నిలబడిన సామాన్య ఓటర్లతో నేరుగా మాట్లాడి, వారికి ఏవైనా అసౌకర్యాలు లేదా భయాందోళనలు ఉన్నాయా అని ఆరా తీశారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేస్తూ ప్రజాస్వామ్య విజయంలో భాగస్వాములు కావాలని, ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు ఎదురుకాకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని నగర పోలీస్ కమిషనర్ క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు.

100 మీటర్ల పరిధిలో కఠిన భద్రతా ఆంక్షలు

కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాల మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి పోలింగ్ కేంద్రం చుట్టూ 100 మీటర్ల పరిధిని ప్రత్యేకంగా నిరోధిత భద్రతా మండలంగా ప్రకటించి, బలమైన బారికేడింగ్‌తో గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు. అనుమతి లేని అనధికార వ్యక్తులు, ఎలాంటి వాహనాలు, రాజకీయ పార్టీల గుర్తులతో కూడిన కండువాలు లేదా ప్రచార సామగ్రితో ఎవరూ 100 మీటర్ల పరిధిలోకి ప్రవేశించకుండా పోలీసులు పక్కా వ్యూహంతో తనిఖీలు నిర్వహించారు. డ్యూటీలో ఉన్న ప్రతి పోలీస్ అధికారి, కానిస్టేబుల్, హోంగార్డు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని నూటికి నూరు శాతం పాటించాలని, ఏ ఒక్క చిన్న పొరపాటుకూ తావివ్వకూడదని కమిషనర్ బాగ్చి ఆదేశించారు. పోలింగ్ సమయం ముగిసిన అనంతరం ఈవీఎంల భద్రత, వాటిని స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించే ప్రక్రియ అత్యంత కీలకమైనదని, అధికారులు, సిబ్బంది అందరూ పోలింగ్ ప్రక్రియ ముగిసి ఈవీఎంలు భద్రపరిచే వరకు పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సీపీ హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో గానీ, ఎన్నికల నిబంధనల అమలులో గానీ ఎలాంటి అలసత్వాన్ని వహించినా సహించేది లేదని తేల్చి చెప్పారు.

విశాఖ పోలీసుల మానవత్వం

ఒకవైపు నగరంలో శాంతిభద్రతలను కాపాడుతూ, చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తూనే మరోవైపు విశాఖ పోలీసులు తమలోని మానవీయ కోణాన్ని చాటుకుని ప్రజల హృదయాలను గెలుచుకున్నారు. ప్రజాస్వామ్య పండుగలో భాగస్వాములయ్యేందుకు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చిన వయోవృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు, నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగ ఓటర్లను చూసి స్పందించిన పోలింగ్ డ్యూటీలోని పోలీసు సిబ్బంది స్వయంగా ముందుకొచ్చారు. దివ్యాంగులను, వృద్ధులను ఎంతో ఆప్యాయంగా పట్టుకుని, వీల్ చైర్ల సహాయంతో పోలింగ్ బూత్‌ల లోపలికి సురక్షితంగా తీసుకెళ్లి వారు తమ ఓటు హక్కును సజావుగా వినియోగించుకునేలా సహకరించారు. పోలీసు యంత్రాంగం చూపిన ఈ అసాధారణమైన సేవా దృక్పథం, ఫ్రెండ్లీ పోలీసింగ్ శైలి, కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహణ పట్ల విశాఖ నగర ప్రజలు, ఓటర్లు, ప్రజాసంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



పట్టపగలే బ్యాంకు దోపిడీ..

తుపాకులు ఎక్కుపెట్టి రూ.4 కోట్ల సొమ్ము కాజేసి...

న్యూఢిల్లీ, నవంబర్ 05, (ది ఎవిడెన్స్): పట్టపగలే బ్యాంకులో భారీ చోరీ జరిగింది. ముఖానికి మునుగు ధరించి చొరబడిన దుండగులు.. తుపాకులతో బెదిరించి రూ.3-4 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు, నగదు కాజేశారు. ఝార్ఖండ్‌లోని గిరిధ్ జిల్లా ధన్వర్ మార్కెట్ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అయిదుగురు నిందితులు రెండు బైక్‌లపై బ్యాంకుకు చేరుకున్నారు. ఆ సమయంలో ఒకరు హెల్మెట్, మరో నలుగురు ముసుగు ధరించారు. అందరి వద్ద తుపాకులు ఉన్నాయి. తొలుత బ్రాంచ్ మేనేజర్ క్యాబిన్‌లోకి చొరబడిన దుండగులు.. ఆయనపైకి తుపాకీ ఎక్కుపెట్టారు. అనంతరం సిబ్బంది, వినియోగదారులందరినీ ఒకచోటికి చేర్చి.. వారందరి ముఖాలు, చేతులకు టేపులు చుట్టారు. మేనేజర్ నుంచి లాకర్ తాళాలు లాక్కుని.. బంగారం, నగదు తీసుకుని ఉడాయించారు. సీసీటీవీ డీవీఆర్‌నూ వెంట తీసుకెళ్లారు. పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఈ చోరీ జరగడం గమనార్హం. బ్యాంకు సిబ్బంది ప్రాథమిక అంచనాల ప్రకారం.. రూ.3-4 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు, రూ.10 లక్షల మేర నగదు చోరీకి గురైంది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. వారు వినియోగించిన రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



ప్రపంచవ్యాప్తంగా ఎబోలా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. వైరస్ రాష్ట్రంలోకి ప్రవేశించకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టింది. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మార్గదర్శకాలకు అనుగుణంగా అంతర్జాతీయ విమానాశ్రయాలు, ఓడరేవుల్లో అనుమానిత ప్రయాణికులకు స్క్రీనింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్రంలోని ఐదు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక ఐసోలేషన్ కేంద్రాలను సిద్ధం చేయడంతో పాటు, ఈనెల 12న సన్నద్ధతను పరీక్షించేందుకు మాక్ డ్రిల్ నిర్వహించనుంది. ఈ మేరకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు గురువారం కేంద్ర ప్రభుత్వ అధికారులకు వివరించారు. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి జి. వీరపాండియన్ రాష్ట్రంలో చేపట్టిన చర్యలను వివరించారు. అనుమానిత కేసుల గుర్తింపు, ఐసోలేషన్, వైద్య నిర్వహణ, రిఫరల్ విధానాల అమలుకు అన్ని విభాగాలను అప్రమత్తం చేసినట్లు తెలిపారు.

కూలిన మూడంతస్తుల భవనం..

ఢిల్లీ : దేశ రాజధాని దిల్లీలో మూడంతస్తుల భవనం కూలిపోయింది. ఓల్డ్ దిల్లీలోని చాందీ బజార్ మెట్రో స్టేషన్ సమీపంలో గురువారం ఉదయం ఈ ఘటన జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా.. శిథిలాల కింద పలువురు చిక్కుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఆ భవనం లోపల నిర్మాణ పనులు జరుగుతున్నాయని స్థానికులు వెల్లడించారు. ఈ క్రమంలోనే అది కూలినట్లు తెలుస్తోంది. ఘటనాస్థలం ఇరుకైన వీధిలో ఉండటంతో సహాయ చర్యలకు ఇబ్బందిగా మారింది. ఇదిలా ఉంటే.. రెండు రోజుల క్రితం భారీ వర్షాల కారణంగా చాందినీ చౌక్‌లోని దిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ టౌన్‌హాల్‌లో కొంతభాగం కూలిపోయింది. ఇటీవల దిల్లీలోని మిలన్ గార్డెన్ ప్రాంతంలో ఒక పాత ఇంటిపై మరో అంతస్తు నిర్మాణం చేపడుతుండగా భవనం కూలిపోయిన సంగతి తెలిసిందే. ఆ ఘటనలోనూ ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. దేశ రాజధానిలో ఈ వరుస ఘటనలు స్థానికులను భయాందోళనలకు గురిచేస్తున్నాయి.



ది ఎవిడెన్స్ THE EVIDENCE డిజిటల్ తెలుగు దినపత్రిక

బొట్టా నీలిమాకు ఘన సత్కారం

- టీడీపీపై ప్రజల నమ్మకానికి ఈ విజయమే నిదర్శనం
- అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తాం: ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి, పట్టాబిరామ్



విశాఖపట్నం: నవంబర్ 05 (ది ఎవిడెన్స్): జీవీఎంసీ ఎన్నికల్లో 27వ వార్డు నుంచి తెలుగుదేశం పార్టీ తరపున ఘన విజయం సాధించిన బొట్టా నీలిమాకు పార్టీ ముఖ్య నాయకుల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్, విశాఖ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు,



నగర మేయర్ ముక్కా శ్రావణి బొట్టా నీలిమాను ఘనంగా సత్కరించారు. నీలిమాతో పాటు ఆమె భర్త బొట్టా వెంకటరమణ దంపతులను శాలువాలతో సత్కరించి, పూలమాలలు వేసి అభినందనలు తెలియజేశారు. ఎన్నికల్లో ప్రజల విశ్వాసాన్ని చూరగొని అత్యధిక మెజార్టీతో విజయం సాధించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ పట్ల 27వ వార్డు ప్రజలకు ఉన్న ఆదరణ, నమ్మకానికి బొట్టా నీలిమా సాధించిన విజయమే స్పష్టమైన నిదర్శనమని ఈ సందర్భంగా నాయకులు కొనియాడారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధిపై ఉందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు వార్డు పరిధిలోని ప్రతి ప్రాంతానికి సమాన ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సమష్టి కృషి, ప్రజల ఆశీర్వాదంతోనే ఈ విజయం సాధ్యమైందని వారు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, పట్టాభిరామ్ మాట్లాడుతూ 27వ వార్డు ప్రజలు బొట్టా నీలిమాపై ఉంచిన విశ్వాసాన్ని ఆమె వమ్ము చేయరనే నమ్మకం తమకు ఉందన్నారు. వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, వాటి పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రహదారులు, డ్రైనేజీ వంటి ప్రజలకు అవసరమైన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి 27వ వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. వార్డు సమగ్ర అభివృద్ధికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను పూర్తిస్థాయిలో అందిస్తామని నాయకులు హామీ ఇచ్చారు. కేవలం ఎన్నికల విజయంతోనే బాధ్యత ముగిసిపోదని, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఇదే సమయంలో తూర్పు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ మరింత బలోపేతం కావడానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు లభించేలా కృషి చేస్తామని పేర్కొంటూ, బొట్టా నీలిమా విజయంపై మరోసారి హర్షం వ్యక్తం చేసి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

చిన్నారుల అశ్లీల వీడియోలు అప్‌లోడ్ చేసిన వ్యక్తికి మూడేళ్ల జైలు

- రూ.10 వేల జరిమానా విధిస్తూ విశాఖ సీజేఎం కోర్టు తీర్పు
- డిజిటల్ ఆధారాలతో నేరం నిరూపించిన సైబర్ క్రైమ్ పోలీసులు



విశాఖ క్రైమ్: నవంబర్ 05 (ది ఎవిడెన్స్): చిన్నారులకు సంబంధించిన అశ్లీల వీడియోలను సోషల్ మీడియా వేదికగా అప్‌లోడ్ చేస్తూ సైబర్ నేరాలకు పాల్పడిన వ్యక్తికి న్యాయస్థానం కఠిన శిక్ష విధించింది. ఈ కేసులో నిందితుడు పెంటకోట హర్షవర్ధన్‌కు మూడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ విశాఖపట్నం చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎం. ప్రదీప్ కుమార్ మంగళవారం తీర్పు వెలువరించారు. చిన్నారులకు సంబంధించిన అసభ్యకర కంటెంట్‌ను సోషల్ మీడియాలో వ్యాప్తి చేయడం తీవ్రమైన నేరమని ఈ తీర్పు మరోసారి స్పష్టం చేసింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేస్తూ ఇటువంటి చర్యలకు పాల్పడేవారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవనే హెచ్చరికను ఈ తీర్పు పంపింది. ఈ కేసులో సైబర్ క్రైమ్ పోలీసులు సేకరించిన డిజిటల్ ఆధారాలు కీలకంగా నిలిచాయి. నిందితుడి కార్యకలాపాలను సాంకేతిక ఆధారాలతో గుర్తించి, కేసును న్యాయస్థానంలో సమర్థవంతంగా నిరూపించడంలో పోలీసులు విజయం సాధించారు.

సోషల్ మీడియా ఖాతా ద్వారా వీడియోల వ్యాప్తి

విశాఖ జిల్లాకు చెందిన పెంటకోట హర్షవర్ధన్ తన మొబైల్ ఫోన్ ద్వారా సోషల్ మీడియాలో అసభ్యకర వీడియోలను వీక్షించడంతో పాటు, చిన్నారులకు సంబంధించిన నిషేధిత అశ్లీల కంటెంట్‌ను డౌన్‌లోడ్ చేసుకునేవాడని పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. అనంతరం తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా 'ష్ట్రుతీంష్ట్రుబిఎవఱుతీఎశే' ద్వారా వాటిని అప్‌లోడ్ చేస్తూ ప్రచారం చేసినట్లు గుర్తించారు. ఈ వ్యవహారానికి సంబంధించి నేషనల్ సెంటర్ ఫర్ మిస్సింగ్ అండ్ ఎక్స్‌ప్లాయిటెడ్ చిల్డ్రన్ సైబర్ టిప్‌లైన్ ద్వారా సంబంధిత అధికారులకు సమాచారం అందింది. కేంద్ర హోంశాఖ, ఏపీ సీఐడీ విభాగం ద్వారా ఈ సమాచారం విశాఖ నగర పోలీసులకు చేరింది. దీంతో నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత భాగ్చి ఆదేశాల మేరకు సైబర్ క్రైమ్ పోలీసులు విచారణ చేపట్టారు. ప్రాథమికంగా అందిన సమాచారాన్ని సాంకేతికంగా పరిశీలించి, నిందితుడి సోషల్ మీడియా కార్యకలాపాలపై ఆధారాలు సేకరించారు. ఈ క్రమంలో 2022 మార్చి 28న ఐటీ చట్టం 2000--2008లోని సెక్షన్ 67-బి కింద క్రైమ్ నంబర్ 174/2022గా కేసు నమోదు చేశారు. తదుపరి దర్యాప్తులో నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేసి న్యాయస్థానం ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

డిజిటల్ ఆధారాలతో నేరం రుజువు

కేసు విచారణ సందర్భంగా సైబర్ క్రైమ్ పోలీసులు నిందితుడికి సంబంధించిన కీలక డిజిటల్ ఆధారాలతో పాటు కాంపాక్ట్ డిస్క్‌లను న్యాయస్థానానికి సమర్పించారు. సాంకేతిక ఆధారాలు, దర్యాప్తులో సేకరించిన వివరాలను పరిశీలించిన న్యాయస్థానం నేరం రుజువైనట్లు నిర్ధారించి మూడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించింది. ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత భాగ్చి మాట్లాడుతూ చిన్నారులకు సంబంధించిన అశ్లీల కంటెంట్‌ను తయారు చేసినా, డౌన్‌లోడ్ చేసినా, ప్రచారం చేసినా చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఇటువంటి సైబర్ నేరాలకు పాల్పడేవారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఈ తీర్పు సైబర్ నేరగాళ్లకు గట్టి హెచ్చరికగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రజలు అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే సోషల్ మీడియా ఫ్రెండ్ రిక్వెస్ట్‌లను అంగీకరించవద్దని, అనుమానాస్పద లింక్‌లను క్లిక్ చేయవద్దని సైబర్ క్రైమ్ పోలీసులు సూచించారు. సైబర్ నేరాలకు గురైనవారు లేదా అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించినవారు వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు లేదా 7995095799 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

వ్యక్తిగత ఫొటోలు, వీడియోలతో బ్లాక్‌మెయిల్

- విశాఖ సైబర్ క్రైమ్ పోలీసుల దర్యాప్తులో సంచలన విషయాలు
- ఇప్పటికే ఇద్దరు అరెస్ట్
- మరో కీలక నిందితుడు కటకటాల్లోకి
- మిగిలిన నిందితుల పాత్రపైనా పోలీసుల నిఘా
- డిజిటల్ ఆధారాలు, ఆర్థిక లావాదేవీలపై లోతైన విచారణ



విశాఖ క్రైమ్: నవంబర్ 05 (ది ఎవిడెన్స్): వ్యక్తిగత ఫొటోలు, వీడియోలు, ఆడియోలు, ఇతర సున్నితమైన సమాచారాన్ని అడ్డుపెట్టుకొని వ్యక్తులను బెదిరిస్తూ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ముఠా వ్యవహారాన్ని విశాఖ నగర సైబర్ క్రైమ్ పోలీసులు వెలుగులోకి తీసుకొచ్చారు. సోషల్ మీడియా, ఇతర డిజిటల్ మాధ్యమాలను వేదికగా చేసుకొని కొందరు వ్యక్తుల వ్యక్తిగత జీవితాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి, దానిని తమ స్వప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నట్లు పోలీసుల దర్యాప్తులో ప్రాథమికంగా వెల్లడైంది. తమకు అనుకూలంగా వీడియోలు రూపొందించాలని బాధితులపై ఒత్తిడి తీసుకురావడం, అందుకు అంగీకరించని పక్షంలో వారి వ్యక్తిగత సమాచారాన్ని మీడియా ద్వారా బహిర్గతం చేస్తామని బెదిరించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ తరహా చర్యలతో బాధితుల వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించడమే కాకుండా, వారిని మానసిక ఒత్తిడికి గురిచేసినట్లు వచ్చిన ఆరోపణలను పోలీసులు తీవ్రంగా పరిగణించారు. ఈ వ్యవహారంపై సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె. భవానీ ప్రసాద్ ఆధ్వర్యంలో క్రైమ్ నంబర్ 144/2026 కింద కేసు నమోదు చేశారు. బీఎన్ఎస్‌లోని పలు సెక్షన్లతో పాటు ఐటీ చట్టంలోని సెక్షన్ 67 ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో బాధితుల వాంగ్మూలాలు, సాంకేతిక ఆధారాలు, డిజిటల్ సమాచారాన్ని విశ్లేషించగా పలువురు వ్యక్తులు పరస్పర సంబంధాలతో ఒక ముఠాగా వ్యవహరిస్తున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. వ్యక్తిగత సమాచారాన్ని అడ్డుపెట్టుకొని బెదిరింపులకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణల వెనుక ఎవరెవరి పాత్ర ఉందనే కోణంలో పోలీసులు విచారణను ముమ్మరం చేశారు.

మరో కీలక నిందితుడి అరెస్ట్

ఈ కేసులో చందన గీత ప్రసన్న, ఆమె భర్త సుగ్గన శివనారాయణతో పాటు మీడియా రంగంలో పనిచేస్తున్న నరేష్, ఉదయ్, రమణమూర్తి తదితరుల పాత్రపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ప్రధాన నిందితులతో సంబంధాలు, పరస్పర సమాచార మార్పిడి, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివరాలను సేకరించి విశ్లేషిస్తున్నారు. ఈ వ్యవహారంలో వ్యవస్థీకృత నేరాలకు సంబంధించిన బీఎన్ఎస్ సెక్షన్ 111 అంశాన్ని సైతం దర్యాప్తులో పరిగణనలోకి తీసుకున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితురాలిగా పేర్కొన్న చందన గీత ప్రసన్నను సెప్టెంబర్ 18, 2026న ద్వారకా పోలీస్ స్టేషన్ వద్ద అరెస్టు చేసి న్యాయస్థానం ద్వారా జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. అనంతరం అక్టోబర్ 5న సుగ్గన శివనారాయణ (ఏ-4)ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. తాజాగా ఇదే కేసులో మరో కీలక నిందితుడిగా పేర్కొన్న కొల్లి ఉదయ్ కుమార్‌ను నవంబర్ 4న అతని నివాసం వద్ద పోలీసులు అరెస్టు చేశారు. ప్రధాన నిందితులతో అతడికి ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు, ఫోన్ కాల్స్, డిజిటల్ చాట్స్ ద్వారా పరస్పర సంబంధాలు ఉన్నట్లు సాంకేతిక ఆధారాల ద్వారా గుర్తించినట్లు పోలీసుల ప్రకటనలో వెల్లడించారు. ఈ ఆధారాల నేపథ్యంలో అతడిని అదుపులోకి తీసుకొని చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా న్యాయస్థానం పది రోజుల రిమాండ్ విధించింది. కాగా, కొల్లి ఉదయ్ కుమార్‌పై గతంలోనూ విశాఖ నగరంలోని పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. ఎంవీపీ పోలీస్ స్టేషన్ క్రైమ్ నంబర్ 152/2026 కేసులో ఆగస్టు 8న న్యాయస్థానంలో ఛార్జిషీట్ దాఖలు చేసినట్లు, అలాగే త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 149/2026 కేసు నమోదైనట్లు వివరించారు.

మిగిలిన వారి పాత్రపై ఆరా

ఈ వ్యవహారంలో మరికొంతమంది వ్యక్తుల ప్రమేయం ఉన్నట్లు దర్యాప్తులో ప్రాథమికంగా వెలుగులోకి రావడంతో సైబర్ క్రైమ్ పోలీసులు తదుపరి చర్యలపై దృష్టి సారించారు. ఇప్పటికే అరెస్టయిన నిందితులతో ఇతరులకు ఉన్న సంబంధాలు, వారి మధ్య జరిగిన ఫోన్ సంభాషణలు, డిజిటల్ చాట్స్, ఆర్థిక లావాదేవీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఒక్కొక్కరి పాత్రను విడివిడిగా నిర్ధారించేందుకు అవసరమైన సాక్ష్యాధారాలను సేకరిస్తున్నారు. ఈ వ్యవహారం వెనుక ఉన్న అసలు ఉద్దేశాలు ఏమిటి, బాధితుల నుంచి ఏ విధంగా ఒత్తిడి తీసుకొచ్చారు, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరు సేకరించారు, వాటిని ఇతరులకు చేరవేయడంలో ఎవరెవరి పాత్ర ఉంది అనే అంశాలపై పోలీసులు అన్ని కోణాల్లో విచారణ సాగిస్తున్నారు. దర్యాప్తులో లభించే ఆధారాల మేరకు మిగిలిన నిందితులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వ్యక్తిగత ఫొటోలు, వీడియోలు, ఆడియోలను అనుమతి లేకుండా వినియోగించడం, వాటిని బహిర్గతం చేస్తామని బెదిరించడం, సోషల్ మీడియా ద్వారా పరువుకు భంగం కలిగించే ప్రయత్నాలు చేయడం చట్టరీత్యా నేరమని పోలీసులు హెచ్చరించారు. ఇలాంటి బెదిరింపులకు గురైన బాధితులు భయపడకుండా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. సైబర్ నేరాలపై షషష.ఎఐఎవతీఎతీఱుఎవ.స్త్రశీజ.ఱుఅ వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని, అత్యవసర సహాయం కోసం 1930 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు. విశాఖ నగర పోలీస్ కమిషనర్ కార్యాలయం 7995095799, జోన్-1 ఎస్‌హెచ్ఓ 9490617917, జోన్-2 ఎస్‌హెచ్ఓ 7995093594 నంబర్లకు ఫోన్ చేసి కూడా ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకునే విషయంలో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద పరిచయాలు, బెదిరింపులను నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఈ కేసులో మిగిలిన నిందితుల పాత్ర, ముఠా కార్యకలాపాల పూర్తి వివరాలను వెలికితీసేందుకు సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తును మరింత వేగవంతం చేశారు.

మొత్తం ఎన్నికల ప్రక్రియనే కబ్జా చేశారు



అమరావతి : స్థానిక ఎన్నికల్లో చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అరాచకాలపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తం ఎన్నికల్ని హైజాక్ చేసిన చరిత్ర కూటమి ప్రభుత్వానిదంటూ మండిపడ్డారు. దేశంలో ఇలాంటి ఎన్నికలు ఎక్కడా జరగలేదని, వీటిని ఎన్నికలంటారా? అని ప్రశ్నించారు. మొత్తం ఎన్నికల ప్రక్రియనే కబ్జా చేశారని, పోలీసులే ఎదుటే రిగ్గింగ్ చేశారనేది వాస్తవం కాదా? అని నిలదీశారు. ఈ రోజు(గురువారం, నవంబర్ 5వ తేదీ) తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ప్రెస్‌మీట్‌లో చంద్రబాబు సర్కారు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడాన్ని తూర్పారబట్టారు. 'ఇవి ఎలక్షన్‌లా? లేక సెలక్షన్‌లా? అన్ని రకాలుగా ప్రజా స్వామ్యాన్ని ఖూనీ చేశారు. దేశ చరిత్రతో ఇలాంటి ఎన్నికలు ఎక్కడా జరగలేదు. ఎన్నికల ప్రక్రియను మొత్తం కబ్జా చేశారు. ఎన్నికల షెడ్యూల్ రాగానే బైండోవర్ కేసుల పేరుతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్ని ఇబ్బంది పెట్టారు. మా నేతల్ని నామినేషన్ వేయకుండా అడ్డుకున్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు జరగ డం లేదు. అధికార దుర్వినియోగంతో, రౌడీయిజంతో ప్రజాస్వా మ్యాన్ని అన్నీ రకాలుగా కూనీ చేశారు. పారదర్శకంగా ఎన్నికలకు వెళ్లే ధైర్యం చంద్రబాబుకు లేదు. ప్రజా స్వామ్యాన్ని కూనీ చేసి చంద్రబాబు మరింత దయనీయ స్థితికి దిగజారారు' అని ధ్వజమెత్తారు.

హోదా పక్కనపెట్టి క్యూలో నిలబడిన మంత్రి



శ్రీకాకుళం నవంబర్ 05, (ది ఎవిడెన్స్): అధికారిక హోదా కంటే ప్రజాస్వామ్య విలువలే గొప్పవని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆచరణలో చాటిచెప్పారు. శ్రీకాకుళం జిల్లా నిమ్మాడ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో సామాన్య ఓటరుగా క్యూలో నిలబడి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. మంత్రి అచ్చెన్నాయుడుతో పాటు ఆయన సతీమణి కింజరాపు విజయమాధవి, కుమారుడు కింజరాపు కృష్ణమోహన్ నాయుడు కూడా ఓటు వేశారు. మంత్రి హోదాలో ఉన్నప్పటికీ ఎలాంటి ప్రత్యేక ప్రాధాన్యం ఆశించకుండా ఇతర ఓటర్లతో కలిసి క్యూలైన్‌లో నిలబడి తన వంతు వచ్చే వరకు వేచి ఉండటం ద్వారా ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడూ సమానమేనన్న సందేశాన్ని అచ్చెన్నాయుడు చాటిచెప్పారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకోవడంలో సామాన్యుడైనా, ప్రజాప్రతినిధైనా అందరూ సమానమేనని తన చర్యతో నిరూపించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజలే యజమానులు. ఓటు అనేది కేవలం గుర్తుపై వేసే ముద్ర కాదు.. ప్రజల భవిష్యత్తును, సమాజ గతిని నిర్ణయించే శక్తిమంతమైన ఆయుధం. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటే పునాది. ప్రతి ఓటుకూ విలువ ఉంది. ఒక్క ఓటు కూడా ప్రజాతీర్పును మార్చగలదు అని పేర్కొన్నారు. ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పండుగలాంటివని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఎలాంటి ప్రలోభాలకు, బెదిరింపులకు, ఒత్తిళ్లకు లోనుకాకుండా స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు వేయాలని సూచించారు. ఓటు వేయడం కేవలం రాజ్యాంగబద్ధమైన హక్కు మాత్రమే కాదని, సమాజ భవిష్యత్తు పట్ల ప్రతి పౌరుడికీ ఉన్న బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడటం ప్రతి ఒక్కరి కర్తవ్యమని, చైతన్యవంతమైన ఓటర్లే బలమైన ప్రజాస్వామ్యానికి పునాదులని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ప్రతి పౌరుడూ బాధ్యతాయుతంగా ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వామి కావాలని ఆకాంక్షించారు.

పరిషత్ పోరులో 71.78 శాతం పోలింగ్!

కడప నవంబర్ 05, (ది ఎవిడెన్స్): గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల సమరం ప్రశాంతంగా ముగిసింది. జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు గురువారం నిర్వహించిన పోలింగ్‌లో ఓటర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లాలోని 21 మండలాల పరిధిలో 599 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, మొత్తం 4,56,650 మంది ఓటర్లకు గాను 3,27,781 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో 71.78 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం నుంచి ప్రారంభమైన ఓటింగ్ ప్రక్రియ చివరి వరకు కొనసాగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలింగ్ ప్రశాంతంగా సాగినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి వెల్లడించారు. జిల్లాలో 16 జెడ్పీటీసీ స్థానాలకు సంబంధించి 72.15 శాతం పోలింగ్ నమోదైంది. ఎంపీటీసీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 68.74 శాతం ఓటింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. జెడ్పీటీసీ స్థానాల్లో ఓటర్ల స్పందన ఎంపీటీసీతో పోలిస్తే ఎక్కువగా కనిపించింది. గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయ పార్టీల బలాబలాలు, అభ్యర్థుల వ్యక్తిగత ప్రభావం, స్థానిక సమస్యలు ఓటింగ్‌పై ఎలాంటి ప్రభావం చూపాయన్నది ఫలితాల అనంతరం స్పష్టం కానుంది. 21 మండలాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచారు. ఎన్నికల సిబ్బంది, పోలీసు అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించడంతో పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగిందని కలెక్టర్ తెలిపారు.

ఉమ్మడి కృష్ణాలో ఎన్నికలు ప్రశాంతం



విజయవాడ: నవంబర్ 05, (ది ఎవిడెన్స్): ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు ఓటర్లు పోటెత్తారు. ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు ఉత్సాహంగా తరలివచ్చారు. మధ్యాహ్నం 3 గంటల సమయానికి కృష్ణా జిల్లాలో 63.04 శాతం, ఎన్టీఆర్ జిల్లాలో మధ్యాహ్నం 1 గంట వరకు 33.32% పోలింగ్ నమోదైంది. పల్లెల్లో, మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం 7 గంటల నుండి బారులు తీరారు. దీంతో ఉదయం నుంచే పోలింగ్ కేంద్రం వద్ద సందడి వాతావరణం నెలకొంది. ప్రజాస్వామ్యంలో ఓటు విలువను చాటుతూ యువత, మహిళలు, వృద్ధులు సైతం ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. బంటుమిల్లి మండలం నాగేశ్వరరావుపేట పోలింగ్ బూత్‌లో పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్, సతీమణి శిరీష, కుటుంబ సభ్యులతో కలసి క్యూ లైన్లో నిలబడి ఓటు హక్కును వినియోగించుకున్నారు. కృష్ణా జిల్లా వ్యాప్తంగా సాయంత్రం 5:00 వరకు పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. సాయంత్రం 5 గంటల సమయానికి క్యూలో ఉన్న వారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆధ్వర్యంలో జిల్లాలో సుమారు 2,000 మంది పోలీసులతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. సమస్యాత్మక ప్రాంతాల్లో సీసీటీవీల ద్వారా వెబ్‌కాస్టింగ్ నిర్వహించారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ ఎన్టీఆర్ జిల్లాలోని గుంటుపల్లి, పాతపాడు తదితర పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించి భద్రత, ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు.

కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షణ

కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి జిల్లా వ్యాప్తంగా పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు ఇరు జిల్లాల కలెక్టర్లు డి. కె బాలాజీ, జి. లక్ష్మీశ పర్యవేక్షించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల రద్దీ, పోలింగ్ నిర్వహణ, సిబ్బంది పనితీరును నిరంతరం సమీక్షించారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు, అపోహలకు లోనుకాకుండా స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకున్నారు. ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలింగ్ నిర్వహణను విజయవంతంగా పూర్తిచేశారు. ఎన్టీఆర్ జిల్లాలోని చాలా ప్రాంతాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగినప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. విస్సన్నపేట మండలం కలగర పోలింగ్ కేంద్రం వద్ద వైస్సార్సీపీ, టీడీపీ శ్రేణుల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరగడంతో గందరగోళం నెలకొంది. పోలీసులు వెంటనే జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అలాగే ఇబ్రహీంపట్నం మండలం దామూలూరులోనూ ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడటంతో పోలీసులు వెంటనే రంగప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

కృష్ణాజిల్లా గన్నవరం నియోజకవర్గం ఉంగుటూరు మండలం మానికొండ గ్రామంలో 106 సంవత్సరాల వయస్సు కలిగిన వృద్ధురాలు కృష్ణంశెట్టి భూదేవమ్మ మానికొండ -2 బూత్ నెంబర్ - 37 లో ఓటు వేసి బాధ్యత గల పౌరురాలుగా పలువురికి స్ఫూర్తిగా నిలిచింది. అలాగే కృష్ణాజిల్లా,బాపులపాడు మండలం హనుమాన్ జంక్షన్, హనుమాన్ నగర్ లోని నాలుగో సెగ్మెంట్లో నడవలేని స్థితిలో కూడా ఒక వృద్ధురాలు తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక్కడ వీల్ చైర్ లేకపోవడంతో అక్కడ ఉన్న కొంతమంది వ్యక్తులు మరియు పోలీస్ కానిస్టేబుల్ అవిడ కు సహాయం చేసి ఓటు వేయించి బయటికి తీసుకువచ్చారు.

భారీ జీతాల ఆశ చూపి యువతను కంబోడియాకు తరలింపు

- డేటా ఎంట్రీ ఉద్యోగాల పేరుతో సైబర్ నేరాల్లోకి నిరుద్యోగులు
- ప్రధాన ఏజెంట్‌పై పీడీ యాక్ట్ ప్రయోగం
- గాజువాక కేంద్రంగా లక్షలాది రూపాయల వసూళ్లు
- నిందితుడిని జైలుకు తరలించిన పోలీసులు



విశాఖ క్రైమ్: నవంబర్ 05 (ది ఎవిడెన్స్): విదేశాల్లో భారీ జీతాలు, ఏసీ గదుల్లో కంప్యూటర్ డేటా ఎంట్రీ ఉద్యోగాలు అంటూ నిరుద్యోగ యువతకు ఆశ చూపించి, వారిని మానవ అక్రమ రవాణా ద్వారా కంబోడియాకు తరలించి సైబర్ నేరాలకు వినియోగిస్తున్న ముఠా కార్యకలాపాలపై విశాఖ సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఈ అక్రమ వ్యవహారాల్లో కీలక పాత్ర పోషిస్తూ, పలుమార్లు సైబర్ నేరాలకు పాల్పడిన గాజువాక ప్రాంతానికి చెందిన చుక్క రాజేష్ వినయ్ కుమార్‌పై పోలీసులు పీడీ యాక్ట్ ప్రయోగించారు. ప్రజా భద్రతకు విఘాతం కలిగించే విధంగా నిందితుడు నిరంతరం నేర కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు గుర్తించిన నేపథ్యంలో పీడీ యాక్ట్-1986 ప్రకారం నిర్బంధ ఉత్తర్వులు జారీ చేసినట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి వెల్లడించారు. ఈ ఉత్తర్వుల మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకుని విశాఖపట్నం సెంట్రల్ జైలుకు తరలించినట్లు తెలిపారు. విదేశీ ఉద్యోగాల ముసుగులో నిరుద్యోగ యువత జీవితాలతో చెలగాటమాడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు.

ఇన్విట్యూట్ ముసుగులో అక్రమ దందా

పోలీసుల దర్యాప్తులో వెలుగుచూసిన వివరాలు విస్తుపోయేలా ఉన్నాయి. గాజువాక కేంద్రంగా ఒక ఇన్విట్యూట్ నిర్వహిస్తున్న చుక్క రాజేష్ వినయ్ కుమార్, దానిని నిరుద్యోగ యువతను ఆకర్షించేందుకు వేదికగా ఉపయోగించుకున్నట్లు పోలీసులు గుర్తించారు. వివిధ జిల్లాలకు చెందిన యువతను లక్ష్యంగా చేసుకుని కంబోడియాలో కంప్యూటర్ డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికేవాడు. విదేశాల్లో మంచి జీతం, సౌకర్యవంతమైన ఉద్యోగం లభిస్తుందన్న ఆశతో వచ్చిన ఒక్కొక్కరి నుంచి సుమారు రూ.2 లక్షల చొప్పున నగదు లేదా ఫోన్‌పే ద్వారా వసూలు చేసేవాడు. అనంతరం వారి పేర్లపై విమాన టికెట్లు బుక్ చేయడంతో పాటు, ప్రయాణ ఖర్చుల కోసం వెయ్యి డాలర్ల వరకు విదేశీ కరెన్సీ మార్పిడి చేసి ఇచ్చేవాడు. మరికొన్ని సందర్భాల్లో కంబోడియాలోని ఏజెంట్ల ద్వారా సుమారు 150 డాలర్లు చెల్లించి పొందిన ఈ-వీసాల ఆధారంగా యువతను విదేశాలకు పంపినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అయితే ఉద్యోగాల కోసం కంబోడియా చేరుకున్న యువతకు అక్కడ ఎదురైన పరిస్థితులు పూర్తిగా భిన్నంగా ఉండేవి. వారిని అక్కడి సైబర్ స్కామ్ కంపెనీలకు అప్పగించి, భారత్‌కు వ్యతిరేకంగా సైబర్ మోసాలకు పాల్పడాలని ఒత్తిడి చేసేవారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇందుకు నిరాకరించిన వారిని మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేసేవారని వెల్లడించారు. ఉద్యోగాల పేరుతో సాగుతున్న ఈ మానవ అక్రమ రవాణా వ్యవహారం బాధితుల ఫిర్యాదులతో వెలుగులోకి రావడంతో పోలీసులు నిందితుడి కార్యకలాపాలపై దృష్టి సారించి పీడీ యాక్ట్‌కు చర్యలు చేపట్టారు.

విదేశీ సైబర్ స్కామ్ ఉద్యోగాల పట్ల అప్రమత్తంగా ఉండాలి.. సీపీ

మయన్మార్, కంబోడియా, వియత్నాం, లావోస్ వంటి ఆగ్నేయాసియా దేశాల్లో భారీ వేతనాలతో ఉద్యోగాలు కల్పిస్తామంటూ వచ్చే ప్రకటనలు, మధ్యవర్తులు, ఏజెంట్ల మాటలను నిరుద్యోగ యువత గుడ్డిగా నమ్మవద్దని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సూచించారు. ముఖ్యంగా డేటా ఎంట్రీ, ఆన్‌లైన్ మార్కెటింగ్, కస్టమర్ సర్వీస్ వంటి ఉద్యోగాల పేరుతో విదేశాలకు పంపించే వారి విషయంలో పూర్తి వివరాలు తెలుసుకోవాలని హెచ్చరించారు. ఆయా దేశాలకు వెళ్లి భారతదేశానికి వ్యతిరేకంగా సైబర్ మోసాలకు పాల్పడే కార్యకలాపాల్లో పాల్గొంటే సంబంధిత వ్యక్తులపై కూడా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. విదేశాల్లో ఉద్యోగం పొందాలనుకునే యువత ముందుగా ఉద్యోగ సంస్థ విశ్వసనీయత, వీసా వివరాలు, నియామక ప్రక్రియ, ఉద్యోగ ఒప్పందం తదితర అంశాలను పరిశీలించాలని సూచించారు. ఇప్పటికే ఇటువంటి మోసాలకు గురైన బాధితులు భయపడకుండా పోలీసులను ఆశ్రయించాలని కోరారు. సైబర్ నేరాలపై ఫిర్యాదు చేసేందుకు నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్ , టోల్‌ఫ్రీ నంబర్ 1930ను సంప్రదించవచ్చని తెలిపారు. అదేవిధంగా పోలీస్ కమిషనర్ కార్యాలయ నంబర్ 7995095799, విశాఖ సిటీ పోలీస్ వాట్సాప్ నంబర్ 9493336633 ద్వారా కూడా సమాచారం అందించాలని సూచించారు. నిరుద్యోగ యువత ఆశలను ఆసరాగా చేసుకుని విదేశీ సైబర్ నేరాలకు బలవంతంగా నెట్టే అక్రమ ఏజెంట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఇలాంటి మానవ అక్రమ రవాణా వ్యవహారాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని సీపీ హెచ్చరించారు.

టీడీపీపై నిందలు వేయడం మానుకోండి

- పులివెందుల అభివృద్ధిపై దృష్టి పెట్టండి
- నల్లపురెడ్డిపల్లె, ఎర్రిపల్లె, వేముల, వేల్పులలో దాడులు చేసింది మీరే
- టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి



పులివెందుల: నవంబర్ 05, (ది ఎవిడెన్స్): ప్రతి చిన్న సంఘటనకు ప్రెస్‌మీట్లు నిర్వహిస్తూ తెలుగుదేశం పార్టీపై రిగ్గింగ్, దౌర్జన్యాలు, పోలీసుల వేధింపులంటూ ఆరోపణలు చేయడం ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డికి అలవాటుగా మారిందని టీడీపీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి తీవ్రంగా విమర్శించారు. ఎన్నికల ఫలితాలను బట్టి మాట మార్చడం, టీడీపీపై బురదజల్లే ప్రయత్నాలు చేయడం సరికాదని హితవు పలికారు. ఎన్నికల అనంతరం స్థానిక టీడీపీ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ లింగాల మండలంలో జరిగిన జెడ్పీటీసీ ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగాయని తెలిపారు. అక్కడ టీడీపీ పోలింగ్ ఏజెంట్లు ఎక్కడైనా హింసకు పాల్పడినట్లు ఆధారాలతో నిరూపించాలని అవినాష్ రెడ్డికి సవాల్ విసిరారు. గతంలో నామినేషన్ల సందర్భంగా తమపై జరిగిన దాడుల నేపథ్యంలో కేసులు ఎదుర్కొన్నప్పటికీ, ఈసారి ఎన్నికలు ప్రశాంతంగా జరగాలనే ఉద్దేశంతో వ్యవహరించామని పేర్కొన్నారు.అదే సమయంలో పులివెందుల మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లెలో 400 నుంచి 500 మంది వైకాపా కార్యకర్తలు టీడీపీ పోలింగ్ ఏజెంట్లపై దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ ఘటనలో టీడీపీ నాయకులకు చెందిన రెండు వాహనాలను ధ్వంసం చేశారని తెలిపారు. ఎర్రిపల్లెలో మహిళలను అడ్డుపెట్టుకుని దాడులకు పాల్పడ్డారని, వేల్పులలో కారం పొడి చల్లడంతో పాటు టపాసులు ప్రయోగించారని ఆరోపించారు. వేములలో ఆరు పోలింగ్ బూత్‌లలో రిగ్గింగ్ జరిగిందంటూ అవినాష్ రెడ్డి చేసిన ఆరోపణలపై కూడా ఆయన స్పందించారు.ఒకవైపు టీడీపీపై రిగ్గింగ్ ఆరోపణలు చేస్తూ, మరోవైపు తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై జరిగిన దాడుల గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఆయా ఘటనలకు సంబంధించిన ఆధారాలు, దృశ్యాలు తమ వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. నామినేషన్ రోజు జరిగిన రాళ్లదాడి, కాల్పులు, బాష్పవాయువు ప్రయోగం వంటి పరిణామాల వెనుక ఎవరున్నారో ప్రజలకు తెలుసని వ్యాఖ్యానించారు.

అన్నదమ్ములిద్దరూ టీడీపీపై బురదజల్లేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించిన బీటెక్ రవి, ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా రాజకీయ ఆరోపణలకే పరిమితం కావడం మంచిది కాదన్నారు. ఇకనైనా ప్రెస్‌మీట్లు, విమర్శలు పక్కనపెట్టి పులివెందుల నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, నియోజకవర్గ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని అవినాష్ రెడ్డికి హితవు పలికారు.

ప్రజా తీర్పును గౌరవించడం జగన్ డీఎన్ఏలోనే లేదు

- ఓటు వేయని జగన్‌కు ఎన్నికలపై మాట్లాడే నైతిక హక్కు లేదు
- ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంతంగా జరిగాయి: ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

అమరావతి, నవంబర్ 05, (ది ఎవిడెన్స్): ప్రజా తీర్పును గౌరవించడం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డీఎన్ఏలోనే లేదని, ఓటు వేయని ఆయనకు ఎన్నికలపై మాట్లాడే నైతిక హక్కు లేదని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ విమర్శించారు. గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించకుండా ఈవీఎంలపై నిందలు వేసిన జగన్, ఇప్పుడు బ్యాలెట్ ద్వారా జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలపైనా ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. బెంగళూరు నుంచి హెలికాప్టర్‌లో వచ్చి ఓటు వేయకుండా వెనుదిరిగిన జగన్‌కు ప్రజాస్వామ్యం, ఓటు హక్కుపై మాట్లాడే అర్హత లేదని ఎద్దేవా చేశారు. గతంలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఏకగ్రీవాలను సమర్థించి, ఇప్పుడు అవే జరిగితే దౌర్జన్యాలంటూ విమర్శించడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంతంగా జరిగాయని, వైసీపీ అభ్యర్థులకు పోలీసు రక్షణ కల్పించి నామినేషన్లు వేసేందుకు అవకాశం ఇచ్చామని తెలిపారు. ఎంపీటీసీ స్థానాల్లో 17,726, జెడ్పీటీసీల్లో 1,445, కార్పొరేషన్ ఎన్నికల్లో 367 స్థానాల్లో వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు వేశారని గుర్తుచేశారు. ప్రభుత్వం, పోలీసులు, ఎన్నికల సంఘం కుమ్మక్కై రిగ్గింగ్ చేశారన్న ఆరోపణలు అవాస్తవమని, వైసీపీకి చెందిన నలుగురు అభ్యర్థులు ఎలా గెలిచారని ప్రశ్నించారు. ఎన్నికలను అడ్డుకునేందుకు డీలిమిటేషన్, బీసీ రిజర్వేషన్లపై 61 కేసులు వేశారని ఆరోపించారు. చట్టపరమైన పరిమితులున్నప్పటికీ బీసీలకు సీట్లు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రయత్నించిందన్నారు.

వైసీపీ విధ్వంస రాజకీయాలను నమ్ముకుంటే కూటమి ప్రభుత్వం ప్రజలను, అభివృద్ధిని, సంక్షేమాన్ని నమ్ముకుందని ధూళిపాళ్ల పేర్కొన్నారు. ప్రజల్లోకి వచ్చి పోరాడాలని, ప్రజాతీర్పును గౌరవించాలని, అసెంబ్లీకి రాకుండా అప్పుడప్పుడు వచ్చి ఆరోపణలు చేసే ధోరణి మానుకోవాలని జగన్‌కు హితవు పలికారు. గెలుపోటములను నిర్ణయించేది ప్రజలేనని, వారి తీర్పును అపహాస్యం చేయడం తగదని అన్నారు.

పరిషత్ ఎన్నికల్లో వైసీపీ విచ్చలవిడి డబ్బు పంపిణీ

- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠాకు ఫిర్యాదు చేసిన టిడిపి
- రాయలసీమ అల్లర్లకు జగన్ ప్రధాన సూత్రధారి: వర్ల రామయ్య



అమరావతి, నవంబర్ 05, (ది ఎవిడెన్స్): పరిషత్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విచ్చలవిడిగా డబ్బు పంపిణీ చేయడంతో పాటు, దాడులు, హింసాత్మక ఘటనలకు పాల్పడుతోందని తెలుగుదేశం పార్టీ నేతలు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠాకు ఫిర్యాదు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 17 ప్రాంతాల్లో జరిగిన అరాచకాలకు సంబంధించి 19 ఫిర్యాదులు అందజేశారు. పోలింగ్ కేంద్రాల్లోకి కర్రలు, పెట్రోల్ బాంబులతో చొరబడి భయాందోళనలు సృష్టించారని ఆరోపించారు. ఎమ్మెల్సీ వర్ల రామయ్య నేతృత్వంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్చూరి అశోక్ బాబు, ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయకుమార్, బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్ లు గురువారం ఎస్ఈసీకి ఫిర్యాదు చేశారు. వైసీపీ దాడులు, అల్లర్లకు సంబంధించిన వీడియో ఆధారాలతో పెన్‌డ్రైవ్‌ను సమర్పించారు. ఓటర్లకు డబ్బుల పంపిణీ, ఎంపీటీసీ అభ్యర్థులపై దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వర్ల రామయ్య మాట్లాడుతూ.. ఓటమి భయంతోనే జగన్ అడ్డదారులు తొక్కుతున్నారని విమర్శించారు. ఓటర్లకు భారీగా డబ్బులు పంపిణీ చేసి, హింసాత్మక ఘటనలకు వైసీపీ శ్రేణులను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. బ్యాలెట్ బాక్సులను ధ్వంసం చేయడం, అభ్యర్థులపై దాడులు చేయడం ద్వారా ఎన్నికలు ప్రశాంతంగా జరగలేదని చూపేందుకు కుట్రలు చేస్తున్నారని అన్నారు. జగన్‌కు సెలెక్షన్‌కు, ఎలక్షన్‌కు తేడా తెలియడం లేదని ఎద్దేవా చేశారు. ప్రజలు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకున్న అభ్యర్థులను సెలెక్షన్ ద్వారా వచ్చినవారిగా చిత్రీకరించడం సరికాదన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న హింసాకాండకు జగన్ ప్రధాన సూత్రధారి అని ఆరోపిస్తూ, ఘటనలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని, పోలీసు ఉన్నతాధికారులను వర్ల రామయ్య డిమాండ్ చేశారు.

ఎలక్షన్ కాదు.. సెలక్షన్ మాదిరిగా ఎన్నికల ప్రక్రియ

- పోలీసుల సహకారంతో టీడీపీ శ్రేణుల అక్రమాలు
- వైసీపీ ఎంపీ అవినాష్‌రెడ్డి ఆరోపణలు



పులివెందుల నవంబర్ 05, (ది ఎవిడెన్స్): జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణలో ప్రజాస్వామ్య విలువలు పూర్తిగా కనుమరుగయ్యాయని, ఎన్నికల ప్రక్రియ ఎలక్షన్ మాదిరిగా కాకుండా సెలక్షన్ తరహాలో సాగిందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. అధికార పార్టీ నేతలకు అనుకూలంగా పోలీసులు వ్యవహరించడంతో వైసీపీ అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆరోపించారు. ఎన్నికల నిర్వహణలో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి, అవసరమైన చోట రీపోలింగ్ నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.గురువారం పులివెందులలోని జగన్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ.. నామినేషన్ల దశ నుంచి పోలింగ్, ఓట్ల లెక్కింపు వరకు ప్రతి సందర్భంలోనూ వైసీపీ శ్రేణులు పోరాటం చేయాల్సి వచ్చిందన్నారు. టీడీపీ నాయకులు పోలీసుల అండతో ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించారని, వైసీపీ నాయకులపై అక్రమ కేసులు నమోదు చేసి అరెస్టులకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ వ్యవహారాలపై వైసీపీ జడ్పీటీసీ అభ్యర్థులు ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. పోలింగ్ కేంద్రాల్లో వైసీపీ ఏజెంట్లను అనుమతించకుండా అడ్డుకోవడం, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేయడం, ఓట్ల సైక్లింగ్‌కు పాల్పడటం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. పార్నపల్లి గ్రామంలో ఏజెంట్లను మొదట అనుమతించకుండా అడ్డుకున్నారని, తాను అక్కడికి వెళ్లిన తర్వాత అనుమతిస్తామని చెప్పి గంటపాటు ఉంచి అనంతరం బయటకు పంపించారని పేర్కొన్నారు. ఎర్రిపల్లి గ్రామంలో ఓటు వేసేందుకు వచ్చిన మహిళలతో సీఐ తిమ్మారెడ్డి దురుసుగా వ్యవహరించి దుర్భాషలాడారని ఆరోపించారు.వేముల మండలంలోని ఒకే పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆరు పోలింగ్ కేంద్రాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓట్ల సైక్లింగ్ జరిగిందని, జిల్లా ఎస్పీ అక్కడే ఉన్నప్పటికీ అక్రమాలు కొనసాగాయని అవినాష్‌రెడ్డి విమర్శించారు. బీటెక్ రవి, పొరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలు ఒకే ఇంట్లో ఉండి నియోజకవర్గ వ్యాప్తంగా ఓట్ల సైక్లింగ్ వ్యవహారాన్ని పర్యవేక్షించారని ఆరోపించారు.పులివెందుల, లింగాల, వేముల మండలాల్లోని పలు గ్రామాల్లో వైసీపీ ఏజెంట్లను పోలింగ్ కేంద్రాల్లోకి రానివ్వకుండా అడ్డుకోవడంతో పాటు వారిపై రాళ్లతో దాడులు చేశారని తెలిపారు. ఆర్.తుమ్మలపల్లెలో హరికృష్ణారెడ్డి, జయలక్ష్మి, వంశీధర్‌రెడ్డి, అచ్చవెల్లిలో లక్ష్మీనారాయణరెడ్డి, జనార్దన్, రాజమ్మ, ఎర్రిపల్లిలో సుధాకర్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, రాజారెడ్డి తదితరులు గాయపడినట్లు వెల్లడించారు.ఎన్నికల నిర్వహణలో చోటుచేసుకున్న పరిణామాలపై రాష్ట్ర ఎన్నికల అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. అధికారుల నుంచి న్యాయం లభించని పక్షంలో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని, ఎన్నికల ప్రక్రియను పూర్తిస్థాయిలో రద్దు చేయించే దిశగా న్యాయపోరాటం సాగిస్తామని ఎంపీ అవినాష్‌రెడ్డి స్పష్టం చేశారు.

THE EVIDENCE
ది ఎవిడెన్స్
ఇన్వెస్టిగేటివ్ తెలుగు దినపత్రిక

సీతాఫలంపైనా ఎల్ నినో ఎఫెక్ట్!

- పెరిగిన ఉష్ణోగ్రతలతో చెట్టుపైనే మాడిపోతున్న పిందెలు
- తగ్గనున్న దిగుబడి.. ధరలు పెరిగే అవకాశం



సీజనల్ ఫ్రూట్‌గా అందరికీ అందుబాటులో ఉండే సీతాఫలం.. ఈసారి సామాన్యులకు అందనంత దూరం వెళ్లున్నది. ఒకవైపు ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తగ్గడం, మరోవైపు పెరిగిన ఉష్ణోగ్రతలు సీతాఫలాల దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. పూత దశలోనే పిందెలు రాలిపోతున్నాయి. కాసిన కాయలు కూడా పూర్తిస్థాయిలో ఎదగడం లేదని ఉద్యానశాఖ అధికారులు పేర్కొంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సీతాఫలాల చెట్లు ఉన్నప్పటికీ ఉమ్మడి పాలమూరు జిల్లా మాత్రం వీటికి పెట్టింది పేరు. జిల్లాలో గుట్టలు, బంజరుభూములు, అటవీ ప్రాంతాలు విస్తారంగా ఉండడమే ఇందుకు ప్రధానకారణం. బాలాపూర్ సీతాఫలానికి జీఐ ట్యాగ్ సైతం లభించింది.

ప్రతీ సీజన్‌లో సీతాఫలాల సేకరణతో పెద్దఎత్తున గ్రామీణ ప్రజలు ఉపాధి పొందుతున్నారు. ఈసారి వాతావరణ పరిస్థితులు సీతాఫలం దిగుబడిపై ప్రభావం చూపుతున్నట్టు ఉద్యాన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. సాధారణంగా సీతాఫలాలు జూలై నుంచి ఆగస్టు మధ్య పూత పిందెగా మారి, సెప్టెంబర్ మొదటివారంకల్లా కాయలు పక్వానికి వస్తాయి. కానీ ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో వర్షాలు గతి తప్పాయి. రోజులతరబడి వానలు లేకపోవడం, అధిక ఉష్ణోగ్రతల కారణంగా చెట్లకు పిందెలు నిలువలేదు. సాధారణంగా ఒకో చెట్టుకు 50 నుంచి 60 కాయలు ఉండాలి. కానీ ప్రస్తుతం పదికి మించి కనిపించడం లేదు. వాస్తవంగా సహజంగా పెరిగే సీతాఫలం చెట్ల సంఖ్య కూడా తగ్గుతున్నదని, దీనికి ఎల్ నినో తోడైనట్టు శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. గుట్టలు తొలగించడం, క్వారీలు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, భూముల వినియోగంలో మార్పులతో సహజ సీతాఫలం చెట్ల విస్తీర్ణం తగ్గుతున్నట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు.

దిగుబడి తగ్గడంతో డిమాండ్ ఎక్కువై రేట్లు అమాంతం పెరిగాయి. నిరుడు ఒక్కో కాయ రూ. 5 నుంచి 10 వరకు విక్రయించారు. గంపల లెకన అయితే రూ.200 నుంచి రూ.250 వరకు అమ్మారు. గ్రామీణ ప్రాంతాలకంటే హైదరాబాద్ వంటి పట్టణాల్లో సీతాఫలాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఒకొక సీతాఫలాన్ని నాణ్యత, బరువును బట్టి.. రూ. 30 నుంచి 50 వరకు అమ్ముతున్నారు. ఆశించిన స్థాయిలో సీతాఫలాల దిగుబడి కనిపించకపోవడంతో ఉపాధి సైతం తగ్గింది. పండ్లను సేకరించిన తర్వాత ప్రాసెసింగ్ చేసే మహిళాసంఘాల సభ్యులు సైతం పనులు లేక ఖాళీగా ఉన్నారు. నిరుడు ఇదే సమయానికి దాదాపు 60 శాతం వరకు సీతాఫలాల ప్రాసెసింగ్ నిర్వహించినవారికి ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఒక పండూ రాలేదంటే పరిస్థితి ఏరకంగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు.

మానసిక సమస్యలకు చికిత్స అంటే కేవలం

మందులు వాడడమే కాదు..

మానసిక ఆరోగ్య సమస్యలకు చికిత్స అంటే కేవలం మందులు వాడడం లేదా చికిత్సా నిపుణులతో మాట్లాడడమే కాదు. బాధితుల సమస్యలను శ్రద్ధగా వినడం, వారి భావాలను అర్థం చేసుకోవడం, గౌరవంగా వ్యవహరించడం కూడా అంతే ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు. ప్రతి వ్యక్తి పరిస్థితి, అవసరాలు, అభిరుచులు భిన్నంగా ఉంటాయి కాబట్టి చికిత్సలో వారి అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. తమ సమస్యలను ఎలాంటి భయం, సంకోచం లేకుండా చెప్పుకునే అవకాశం కల్పించడంతోపాటు, వారిని తప్పుగా అర్థం చేసుకోకుండా పూర్తి వివరాలను తెలుసుకోవడానికి వైద్యులు, చికిత్సా నిపుణులు తగిన ప్రశ్నలు అడగాలని చెబుతున్నారు.



మందులు ఎందుకు ఇస్తారు..

కుంగుబాటు, ఆందోళన, ద్విధ్రువ మానసిక రుగ్మత వంటి సమస్యల నిర్వహణలో మందులు కీలక పాత్ర పోషిస్తాయి. అయితే ఏ మందులు ఎందుకు ఇస్తున్నారు, వాటి వల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటి, ఎంతకాలం వాడాలి, ఎలాంటి దుష్ప్రభావాలు ఉంటాయి అనే విషయాలను రోగులకు స్పష్టంగా వివరించాలి. మందులు వాడిన తర్వాత ఇబ్బందులు ఎదురైనా, ఆశించిన ఫలితాలు కనిపించకపోయినా వైద్యులతో నిస్సంకోచంగా చర్చించాలని సూచిస్తున్నారు. చికిత్సకు సంబంధించిన నిర్ణయాల్లో రోగులను భాగస్వాములను చేయడం వల్ల వారిలో విశ్వాసం పెరుగుతుందని, తమ ఆరోగ్యంపై తమకూ నియంత్రణ ఉందనే భావన కలుగుతుందని నిపుణులు పేర్కొంటున్నారు.

సమస్యలను చెప్పుకుంటే సరిపోదు..

మానసిక చికిత్స అంటే సమస్యలను చెప్పుకోవడంతోనే ముగిసిపోదు. తమ భావాలను అర్థం చేసుకోవడం, ప్రతికూల ఆలోచనా విధానాలను గుర్తించడం, సమస్యలను ఎదుర్కొనే నైపుణ్యాలను అలవర్చుకోవడం, ఆరోగ్యకరమైన సంబంధాలను పెంపొందించుకోవడం వంటి అంశాల్లో ఇది సహాయపడుతుంది. చికిత్సా నిపుణులు రోగులకు ఆదేశాలు ఇవ్వడం కంటే, వారితో కలిసి పనిచేయడం ముఖ్యం. అలాగే ఒకే రకమైన మానసిక సమస్యతో బాధపడుతున్న ఇద్దరు వ్యక్తులకు ఒకే విధమైన చికిత్స సరిపోదు. వారి జీవనశైలి, కుటుంబ పరిస్థితులు, ఆర్థిక స్థితి, సాంస్కృతిక నేపథ్యం, వ్యక్తిగత లక్ష్యాలను పరిగణనలోకి తీసుకుని చికిత్సను రూపొందించాలి. కొందరికి మందులు, మరికొందరికి మానసిక చికిత్స, ఇంకొందరికి ఈ రెండూ అవసరం అవుతాయి.

గోప్యత, స్వేచ్ఛ అవసరం..

మంచి మానసిక ఆరోగ్య సంరక్షణలో రోగుల గౌరవం, వ్యక్తిగత గోప్యత, స్వేచ్ఛకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. తమ ఆరోగ్య పరిస్థితి గురించి సులభంగా అర్థమయ్యే సమాచారం పొందడం, చికిత్సకు సంబంధించిన నిర్ణయాల్లో పాల్గొనడం ప్రతి రోగికి అవసరం. చికిత్స లక్ష్యాలను కూడా వారి అభిప్రాయాలతో కలిసి నిర్ణయించాలి. కొందరికి తిరిగి ఉద్యోగంలో చేరడం, మరికొందరికి కుటుంబ సంబంధాలను మెరుగుపరచుకోవడం లేదా రోజువారీ పనులను సులభంగా చేసుకోగలగడం విజయంగా ఉంటాయి. క్రమం తప్పకుండా వైద్యులను సంప్రదించడం, చికిత్సలో ఎదురవుతున్న అనుభవాలను పంచుకోవడం ద్వారా అవసరమైన మార్పులు చేసుకోవచ్చు. లక్షణాలను తగ్గించడమే కాకుండా, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి ఆరోగ్యకరమైన జీవితాన్ని గడిపేలా చేయడమే సమర్థవంతమైన మానసిక ఆరోగ్య సంరక్షణ లక్ష్యమని నిపుణులు చెబుతున్నారు.

పానీపూరిఎప్పుడు, ఎక్కడ, ఎలా పుట్టిందో...

పానీపూరి పుట్టుక గురించి రకరకాల కథలు ప్రచారంలో ఉన్నాయి. వీటిలో అత్యంత ఆసక్తికరమైనది... మహాభారత కాలానికి చెందినది. పాండవులు అజ్ఞాతవాసంలో ఉన్న కాలంలో... కోడలు ద్రౌపది తెలివితేటలను రకరకాలుగా పరీక్షించేవారట కుంతీ.

ఆ పరీక్షలలో ఒకటి... బంగాళదుంప కూరలో మిగిలిన భాగాన్ని, గోధుమ పిండితో చేసిన చిన్న ముద్దను ఇచ్చి... 'వీటితోనే అయిదుగురు అన్నదమ్ముల ఆకలి తీర్చు' అని చెప్పిందట. ఈ నేపథ్యంలో ఒక సృజనాత్మక మార్గాన్ని కనిపెట్టింది ద్రౌపది. తనకు ఇచ్చిన తక్కువ పిండితో చపాతి చేయడానికి బదులుగా, చిన్న చిన్న భాగాలు చేసింది. పిండి ముక్కలను గుల్లగా మారేలా వేయించి, వాటిలో బంగాళదుంప మిశ్రమాన్ని నింపింది. అదే... పానీపూరి తొలిరూపం!



కోడలి సృజనాత్మకతను చూసి కుంతి ముగ్ధురాలైందట. ఆ సంతోషంలో కోడలు తయారుచేసిన వంటకానికి అమరత్వం ప్రసాదించిందట! ఆ వరం వల్లే 'పానీపూరి'గా బాగా పాపులర్ అయిందట. బిహార్‌లోని ప్రాచీన మగధ ప్రాంతంలో 'పానీపురి' పుట్టిందని మరో కథనం.



'సర్'లో ఓటు కోల్పోతే ఫామ్-6తో మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చు

న్యూఢిల్లీ: ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ(సర్)లో పేర్లు తొలగించబడినవారు మళ్లీ ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఫామ్-6 సమర్పించవచ్చని ఎన్నికల సంఘం ఢిల్లీ హైకోర్టుకు తెలిపింది. సర్ ప్రక్రియలో ఓటు కోల్పోయిన ఇద్దరు వ్యక్తులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈసీ ఈ విషయం వెల్లడించింది. తాము చిరునామా మారడంతో గణన ప్రక్రియలో పాల్గొనలేకపోయామని, అందువల్ల ఓటర్ల జాబితాలో పేర్లు తొలగిపోయాయని పిటిషనర్లు కోర్టుకు తెలిపారు. కొత్తగా పేరు నమోదు చేసుకునేందుకు ఫామ్-6 సమర్పించాలనే నిబంధనకు బదులుగా, పాత పేర్లను పునరుద్ధరించేందుకు ఫామ్-8 ద్వారా అవకాశం కల్పించాలని కోరారు. అయితే, 1960 నాటి ఓటర్ల నమోదు నిబంధనల ప్రకారం ఫామ్-6ని సమర్పించి, సమస్యను పరిష్కరించుకోవచ్చని ఈసీ తరఫు న్యాయవాది కోర్టుకు వివరించారు. ఎన్నికల నమోదు అధికారి కూడా అవసరమైన సహాయం అందిస్తారని తెలిపారు.

తమిళనాట వర్ష బీభత్సం..

చెన్నై సహా పలు జిల్లాలకు 'ఆరెంజ్ అలర్ట్'

చెన్నై: తమిళనాడును భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వాతావరణ శాఖ చెన్నై, తిరుచిరాపల్లి, కోయంబత్తూరు, నీలగిరి జిల్లాలకు సోమ వారం 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేసింది. ఈ నాలుగు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు హెచ్చరిం చారు. రాష్ట్రంలోని ఉత్తర, పశ్చిమ, మధ్య, దక్షిణ ప్రాంతాల్లో వర్షాల తీవ్రత ఎక్కువగా ఉండ నుంది. ధర్మపురి, కృష్ణగిరి, సేలం, తిరువళ్లూరు, దిండిగల్, తేని, విరుదునగర్, తెన్కాశి, తిరునెల్వేలి, కన్యాకుమారి, తూత్తుకుడి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం వెల్లడించింది. కావేరి డెల్టా సహా పరిసర ప్రాంతాలైన మదురై, రామనాథపురం, శివగంగ, పుదుక్కోట్టై, తంజావూరు, నాగపట్నం, కడలూరు, చెంగల్పట్టు, కాంచీపురం, వెల్లూరు జిల్లాల్లోనూ జోరువానలు కురుస్తాయని పేర్కొంది. పశ్చిమ జిల్లాలైన కోయంబత్తూరు, నీలగిరి ప్రాంతాల్లో వర్ష ప్రభావం మరింత తీవ్రంగా ఉండే సూచనలు కనిపిస్తున్నాయి. మంగళవారం కూడా వర్షాల జోరు కొనసాగనుంది. మంగళవారానికి సంబంధించి తిరునెల్వేలి, మదురై జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఆ రోజున చెన్నై సహా రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా 35 జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు తెలిపారు.

రామాయణం రివ్యూ

సినిమా పేరు: రామాయణం

తారాగణం: రణబీర్‌కపూర్, సాయిపల్లవి, యశ్, కాజల్ అగర్వాల్, రకుల్‌ప్రీత్‌సింగ్, రవి దూబే, వివేక్ ఒబెరాయ్, అరుణ్‌గోవిల్.

భారతీయ సినిమా చరిత్రలో అత్యధిక బడ్జెట్‌తో రూపొందుతున్న ఫ్రాంచైజీగా చరిత్ర సృష్టించింది నితీశ్ తివారీ 'రామాయణ'. ప్రకటన వచ్చిన నాటి నుంచే ఈసినిమాపై అంచనాలు మొదలయ్యాయి. రాముడిగా రణబీర్, సీతగా సాయిపల్లవి, రావణుడిగా యశ్, మండోదరిగా కాజల్, కైకసిగా శోభన, శూర్పణఖగా రకుల్ ప్రీత్‌సింగ్.. ఇలా తారాగణ వివరాలు తెలియగానే ఆ అంచనాలు ఆకాశాన్నంటాయి. ప్రచార చిత్రాలు సైతం ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తిని రెట్టింపు చేశాయి. ఫస్ట్ పార్ట్ ఈ దీపావళికీ, నెక్స్ట్ పార్ట్ వచ్చే ఏడాది దీపావళికి అని ప్రకటించగానే, తొలిపార్ట్ కోసం దేశవ్యాప్తంగా ఉన్న సినీప్రియులంతా ఆతృతగా ఎదురు చూశారు. అనుకున్నట్టే 'రామయాణ - 1' సినిమా గురువారం థియేటర్లలోకి ఎంట్రీ ఇచ్చింది. మరి అందరి అంచనాలనూ ఈ సినిమా అందుకున్నదా? ఈ సినిమాకు ముందు బాలీవుడ్‌లోనే తెరకెక్కిన 'రామాయణ' ఇతిహాసం 'ఆది పురుష్' ఆడియన్స్‌కి, నిర్మాతలకు చేదు అనుభవాలను మిగిల్చింది. మరి నితీశ్ తివారీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించిన ఈ 'రామాయణం' ప్రేక్షకుల ఎలాంటి అనుభూతినిచ్చింది? అనేది తెలుసుకునే ముందు కథలోకి వెళ్లాలి.

కథ : ఇది యుగయుగాలుగా భారతీయుల రక్తంలో జీర్ణించుకుపోయిన కథ. కాబట్టి రామాయణ కథ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇది జగమెరిగిన కావ్యం. అయితే.. ఈ సినిమా రెండు భాగాలుగా రూపొందించారు కనుక, ఈ తొలి భాగం దశాననుడు రావణుడిగా మారిన పరిణామక్రమాన్ని, శ్రీరాముడి జన్మవృత్తాంతం, తాటక వధ, శివధనుర్భగం, సీతారామలక్ష్మణ వనవాసం, కబంధనుని వధ, కరదూషణాధుల వధ, సీతాపహరణం, జటాపు మరణం ఘట్టాలతో సాగింది. జాటాయు మరణానంతరం 'రావణుడ్ని సంహరించబోతున్నాను' అంటూ రాముడు ప్రతిజ్ఞ చేయడంతో ఈ తొలి భాగం ముగిసింది. ఇక సుందరకాండ, రావణ వధ, శ్రీరామపట్టాభిషేకం తదితర అంశాలన్నీ రెండో పార్ట్‌లో ఉంటాయన్నమాట.

విశ్లేషణ : దేవదానవ సంగ్రామంలో ఓడిపోయి, రాజ్యాన్ని పోగొట్టుకొని పాతాళలోకంలో తలదాచుకున్న రాక్షస జాతికి పునరుజ్జీవాన్ని అందించేందుకు దానవరాణి కైకసి, తన తనయుడు దశాననుడిలోని పౌరుషాగ్నిని రగిల్చడం, ఘోర తపస్సు చేసి, బ్రహ్మ దేవుడి వరాన్ని పొందిన దశాననుడు దానవసామ్రాట్టు రావణబ్రహ్మగా లంకా రాజ్య సింహాసన్నా అధిష్ఠించడంతో కథ మొదలైంది. ప్రతినాయకుడి శక్తిసామర్థ్యాలను అద్భుతంగా ఆవిష్కరించి, కథానాయకుడు సాధించబోయే కార్యం ఎంత కష్టతరమైనదో ప్రేక్షకులకు వివరించడంలో ముందు దర్శకుడు నితీశ్ తివారీ సక్సెస్ అయ్యారు. నిజానికి రావణుడి పాత్రకు ఆయనిచ్చిన ఎలివేషన్స్ రాముడికి కూడా ఇవ్వలేదు. నిజానికి రాముడికి ఎలివేషన్ అవసరం లేదు కూడా. రావణుడనేవాడు ఎంతటి మహావీరుడైనా, శక్తివంతుడైనా చివరకు వాడు పోయేది రాముడి చేతిలోనే అని ఆడియన్స్‌కి తెలుసు కాబట్టి, ఎలివేషన్స్ అవసరం లేదనుకుని ఉండొచ్చు. సాదాసీదాగా రాముడి పాత్రను కథలోకి ప్రవేశింపజేసి, నిదానంగా ఆడియన్స్‌కి 'శ్రీరాముడు' అనే వ్యాక్సిన్‌ని ఆడియన్స్‌కి ఇంజెక్ట్ చేశాడు దర్శకుడు నితీశ్. సినిమా చూడంగ చూడంగ.. రణబీర్‌లో రాముడ్ని చూడటం మొదలుపెట్టారు ఆడియన్స్. రణబీర్ కూడా అభినయం విషయంలో అద్భుతం అనిపించాడు. అయితే.. అతని ఆహార్యం బావున్నా.. నీలమేఘశ్యాముడిగా రాముడ్ని చూపించకపోవడం తెలుగువారికి మింగుడు పడదు.



అందుకే.. రణబీర్‌ని రాముడిగా ఒప్పుకోవడానికి కాస్తంత టైమ్ పడుతుంది. నిజానికి 'రామాయణం'లోని బాలకాండ, అరణ్యకాండ కాస్త స్లోగా అనిపిస్తాయి. కానీ దర్శకుడు నితీశ్ తివారీ ఎక్కడా జనానికి విసుగు అనిపించకుండా, తొలి పావుగంట రావణాసుడి ఎపిసోడ్‌తో, తర్వాత తాటక వధ, కంబధ వధ, కరదూషణాదుల వధ, జటాయు మరణం.. లాంటి అద్భుతమైన యుద్ధ సన్నివేశాలను హాలీవుడ్ స్థాయిలో తెరకెక్కించి, ఎక్కడా ల్యాగ్ అనిపించకుండా ఆసక్తికరంగా, అందరికీ నచ్చేలా తీసి, సక్సెస్ అయ్యారు. అయితే.. ఇప్పటివరకూ రావణమాత కైకసి పాత్రను పాజిటీవ్‌గానే మనం చూశాం.కానీ ఈ సినిమాలో కైకసి నుంచి రావణుడ్ని విష్ణుద్వేషం మొదలైనట్టు చూపించారు. అలాగే.. శ్రీరాముడి ముందు భార్గవరాముడు మోకరిల్లడం లాంటి సీన్స్ కూడా జనానికి మింగుడు పడవు. అయితే.. మిగతా సన్నివేశాలన్నీ జనరంజకంగా తెరకెక్కించారు. మొత్తంగా తొలిభాగంతోనే దర్శకుడు నితీశ్ జనాల్లో మంచి మార్కులు సంపాదించుకున్నారు.

నటీనటులు : రాముడిగా రణబీర్ చక్కగా అభినయించాడు. పరశురాముడిగా కూడా ఓ సన్నివేశంలో కనిపించి అదరహో అనిపించుకున్నారు. ఇక సీతగా సాయిపల్లవి ఒదిగిపోయి నటించింది. ఆమె ఆహార్యం, అభినయం నిజంగా అద్భుతం. ఇందులో సీతను కూడా ఓ యోధురాలిగా చూపించి, ఓ కొత్త ప్రయోగానికి తెరలేపారు దర్శకుడు నితీశ్. రామాయణాన్ని నిశితంగా గమనించిన వారికి, అలా చూపించడం తప్పు కాదు అనిపిస్తుంది. ఎందుకంటే.. మహావీరులు, మహాబలులు సైతం ఎత్తలేని శివధనుస్సును అలవోకగా ఎత్తిన మహాబలశాలి సీతామ్మ. అలాంటి సీతమ్మ యోధురాలు ఎందుకు కాకూడదు?. మొత్తంగా సాయిపల్లవి సీతగా చాలా బాగా నటించింది. సీతాసాధ్విగా, వీరనారిగా పలు కోణాలను ఆమె పలికించిన తీరు బావుంది. లక్ష్మణుడిగా రవి దూబే కూడా బావున్నాడు. ఇక రావణుడిగా యశ్ అయితే.. విశ్వరూపం చూపించాడు. శూర్పణఖ పాత్రకు రకుల్ ప్రీత్‌సింగ్ నటన ఓ గౌరవాన్ని తెచ్చింది. మిగతా నటీనటులంతా పరిధిమేర తమ పాత్రలకు న్యాయం చేశారు. సాంకేతికంగా అన్ని విభాగాలూ బాగా పనిచేశారు. ఆర్టిఫీషియల్ ఇంటలిజన్స్(ఏఐ) ఉపయోగించి డబ్బింగ్ విషయంలో, అచ్చంగా తెలుగు సినిమాను చూస్తున్న అనుభూతినే తీసుకురాగలిగారు. లిప్ సింక్ కూడా సరిగ్గా సరిపోయింది. కెమెరా పనితనం బావుంది. ఏఆర్ రెహమాన్ పాటలు, నేపథ్య సంగీతం భావగర్భితంగా, కథ స్థాయికి తగ్గట్టుగా సాగింది. యాక్షన్ అంశాలను కూడా అద్భుతంగా తెరకెక్కించారు. సీజీ వర్క్ అయితే.. నేచురల్‌గా అనిపించింది. మొత్తంగా నిర్మాత పెట్టిన ప్రతి పైసా తెరపై కనిపించింది. రావణాడ్ని సంహరిస్తానని రాముడు చెప్పడంతో ప్రథమార్ధం ముగిసింది. సెకండ్‌పార్ట్‌లో ఆంజనేయుడు రాబోతున్నాడని హింట్ ఇస్తూ.. ఆంజనేయుడి బిట్స్‌ని చూపించి, సముద్రాన్ని లంఘిస్తున్న మారుతిగా సన్నీడియోల్‌ని వెనకనుంచి చూపించడం ఆడియన్స్‌కి గూస్‌బంప్స్ తెప్పించాయి. హనుమాన్‌చాలీసా వస్తుండగా టైటిల్స్ దిగుతుంటే.. ఆంజనేయుడి ఆగమానం గుర్తొచ్చి జనం భావోద్వేగానికి లోనయ్యారు.



Published By : G. Srinivasa Rao. Printed by Harsha Vardhana. J at The Evidence Press, 4-72-4, Second Floor, Shalom House, Beach Road, Lawsons Bay Colony, Visakhapatnam - 530017,A.P, INDIA. T/AP/2025/1017/2082/1372.
Contact : +91 9966850202, +91 9885485277. epaper.theevidencetelugu.in, theevidencedhinapathrika@gmail.com